
www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం । 15 । మార్చి । 2026



## నేరస్తులకు సింహస్వప్నంగా
# షాద్‌నగర్ సీతయ్య

- సీతయ్య ఎవరి మాట వినడు
- పైరవీకార్లకు దూరంగా పోలీస్ స్టేషన్



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఇప్పుడు నేరస్తుల పరిస్థితి చూస్తే ఒక్క సినిమా డైలాగ్ గుర్తొస్తోంది... "సీతయ్య ఎవరి మాట వినడు!" ఎందుకంటే కేసు ఎంత క్లిష్టమైనదైనా... నేరస్తుడు ఎంత తెలివిగా ప్లాన్ వేసినా... షాద్‌నగర్ పోలీసుల కన్ను తప్పించుకోవడం అసాధ్యమనే పరిస్థితి నెలకొంది. వరుసగా మూడు కీలక కేసులను

మిగతా.. 2లో

# సింగరేణికి పూర్వ వైభవం

- కొత్త గనులు ఉద్యోగాలే లక్ష్యం
- మంత్రి డా.జి.వివేక్ వెంకటస్వామి



**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** సింగరేణి సంస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం కార్మికులు, అధికారులు సమిష్టిగా బాధ్యతా యుతంగా పనిచేయాలని ఆయన సూచించారు. మందమర్రి సింగరేణి ఏరియాలోని కేకే–5 గనిపై శ్రమశక్తి అవార్డు గ్రహీత ఏడుకోల పవన్ కుమార్ సన్మాన కార్యక్రమానికి మంత్రి ముఖ్య

మిగతా.. 2లో

# నత్తనడకన రోడ్డు పనులు

- సమస్యలు పట్టించుకోట్లే
- మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**అక్షిత ప్రతినిధి, ఎల్బీనగర్:** బియన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ గణేష్ ఆలయం వద్ద కొనసాగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను బియన్ రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా, మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని సంబంధిత

మిగతా.. 2లో



- మాది రైతు పక్షపాతి సర్కార్
- చివరి గింజ వరకు మద్దతు ధరకు కొంటాం
- 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నాం
- 4600 కోట్లను రైతుల ఖాతాలో వేశాం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

## వరి పంటలో
# మనమే టాప్

**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** దేశంలో వరి పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న అనంతరం అక్కడే రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గడచిన రెండున్నర సంవత్సరాలలో అత్యధికంగా వరి పండించిన కొనుగోలు చేసిన రాష్ట్రం తెలంగాణ

మిగతా.. 2లో

# పారదర్శకతతో ప్రజాస్వామ్యం బలోపేతం

**-భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్**




**మెదక్, అక్షిత బ్యూరో:** ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ అన్నారు. గురువారం ఎంపిక చేసిన రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాలను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, 18 సంవత్సరాలు నిండిన వారు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. యువ ఓటర్ల నమోదు, మహిళల భాగస్వామ్యం, దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇంటింటి సర్వేలు, పోలింగ్ స్థాయి అధికారుల పని తీరు,

మిగతా.. 2లో

# నేరస్తులకు సింహస్వప్నంగా షాద్‌నగర్ సీతయ్య

మొదటి పేజీ తరువాయి..



ఛేదిస్తూ పోలీసులు ఇప్పుడు ప్రజల్లో రియల్ హీరోలుగా మారిపోయారు.

డబ్బు కోసం జరిగిన పల్లె కేశవుల హత్య కేసును కేవలం 48 గంటల్లో ఛేదించడం పోలీసుల పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. నిందితులు ఆనవాళ్లు లేకుండా తప్పించుకున్నామని భావించినా... టెక్నికల్ ఎవిడెన్స్, సీసీటీవీ ఫుటేజీలు, గ్రౌండ్ లెవెల్ ఇన్వెస్టిగేషన్‌తో షాద్‌నగర్ పోలీసులు ఒక్కో క్లూను జోడిస్తూ చివరకు హంతకులను కటకటాల వెనక్కి నెట్టారు. "పోలీస్ ట్రాకింగ్ మొదలైతే ఎక్కడ దాక్కున్నా ఉపయోగం లేదు" అని మరోసారి నిరూపించారు. ఇక "బరిష్ పూజ" పేరుతో ప్రజలను మోసం చేస్తున్న అంతర్ జిల్లా ముఠాపై పోలీసులు చేసిన ఆపరేషన్ అయితే అసలు సినిమా కథను తలపించింది. డబ్బును మూడు రెట్లు చేస్తామంటూ అమాయకులను నమ్మించి లక్షలు దోచుకుంటున్న గ్యాంగ్‌ను పోలీసులు నిశ్శబ్దంగా ట్రాక్ చేసి చివరకు భారీ మొత్తంలో నగదు, కారు, మొబైల్ ఫోన్లతో సహా అరెస్ట్ చేశారు. మోసగాళ్ల ఆటకు ఫుల్ స్టాప్ పెట్టారు.

మరోవైపు ఫరూఖ్‌నగర్‌లో అక్రమ మట్టి తవ్వకాలపై కూడా పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. అర్ధరాత్రి ప్రత్యేక ఆపరేషన్‌లో టిప్పర్లు, జేసీబీలు స్వాధీనం చేసుకుని అక్రమ దందాలకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. "షాద్‌నగర్‌లో అక్రమాలకు చోటు లేదు" అనే సంకేతాన్ని స్పష్టంగా ఇచ్చారు. పైరవికారులను దూరం పెట్టి ప్రజలకు నేరుగా అందుబాటులోకి రావడం ద్వారా సిఐ ఒక విధంగా మంచి పేరు తెచ్చుకున్నారు. నేరుగా బాధితులకు న్యాయం చేస్తూ పేద ప్రజలకు పోలీస్ స్టేషన్ ను అందుబాటులో తీసుకొచ్చారు.

ఈ వరుస విజయాల వెనుక డీసీపీ సీహెచ్ శిరీష నాయకత్వం, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ సమన్వయం కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా షాద్‌నగర్ టౌన్ సీఐ కె. సీతారాం ఇప్పుడు ప్రజల్లో ప్రత్యేక చర్చగా మారారు. "సీతారాం సార్ రంగంలోకి దిగారంటే... కేసు క్లోజ్ అయినట్టే" అంటూ స్థానికులు మాట్లాడుకుంటున్నారు.

పగలు రాత్రి తేడా లేకుండా పనిచేస్తున్న షాద్‌నగర్ పోలీసులు ప్రస్తుతం ప్రజలకు భరోసాగా... నేరస్తులకు భయంగా మారిపోయారు. వరుస విజయాలతో "ఖాకీ" పవర్ అంటే ఏమిటో మరోసారి చూపిస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పట్లో ఎస్ఐ గా ఉన్న ముత్తయ్య ప్రజల పక్షాన నిలిచి ప్రజల మనలనున్నారు. అదేవిధంగా ఇప్పుడు సీతారాం సిఐ ప్రజల మన్ననలు చురగొంటున్నారు. ఇదే క్రమంలో షాద్నగర్లో తెరవెనుక ఒకలా.. తెర ముందు ఒకలా జరుగుతున్న బ్లాక్మెయిలింగ్ వ్యవహారాన్ని అరికట్టి పేదలకు మరింత చేరువ కావాలని సిఐని ప్రజలు కోరుతున్నారు

# వరి పంటలో మనమే టాప్

మొదటి పేజీ తరువాయి..

అని తెలిపారు.ప్రతి రైతుకు మద్దతు ధర వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 22 వేల కోట్ల రూపాయలను చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ రబీలో 65 లక్షల ఎకరా లలో 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు. అందులో 80 నుండి 90 లక్షలు మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేయనుందని, ధాన్యం కొనుగోలుకై 18.67 కోట్ల గన్ని బ్యాగులను పిపిసి సెంటర్లకు పంపించినట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రతి సెంటర్తో పాటు, మండల,నియోజకవర్గ స్థాయిలో అధికారులను నియమించామని ,ధాన్యం కొనుగోలుకు అన్ని రకాల వాహనాలను వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్లకు విస్తృత అధికారాలు కల్పించామని ,రాష్ట్రవ్యాప్తంగా రబీ ధాన్యం కొనుగోలుకు 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని,4600 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లలో జమ చేయడం జరిగిందని, రానున్న రెండు, మూడు రోజుల్లో మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపించడం జరుగుతుందని,అలాగే 3000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయనున్నామని చెప్పారు. మూడు లక్షల 84,000 మంది రైతుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

నల్గొండ జిల్లాకు సంబంధించి ఐదు లక్షల 46000 ఎకరాల్లో 14 లక్షల 65 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం పండిందని, ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నల్గొండ జిల్లాలో 7 లక్షల 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, నల్గొండ జిల్లాలోనే 456 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని ,కోటి 22 లక్షల గన్ని బ్యాగులు ఇచ్చామని, 53,611 మంది



రైతులకు మద్దతు ధర చెల్లించి 692 కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, రెండు, మూడు రోజుల్లో మరో 400 కోట్లు రైతుల ఖాతాలలో ట్రాన్స్ఫర్ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 1000 వాహనాలను రబీ ధాన్యంకై ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు పండించిన ధాన్యాన్ని ఎంఎస్పీ చెల్లించి కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, ధాన్యం సేకరణలో పశ్చిమబెంగాల్ కూలీలను వినియోగిస్తున్నందున అక్కడ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా హమాలీల సమస్య ఉత్పన్నమైందని, తరుగు,తాలు విషయంలో మిల్లర్లు , ట్రేడర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1800 మిల్లులు ఎంఎస్పి ఆపరేషన్ లో పాల్గొంటున్నాయని, 12 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఇంటర్మీడియట్ గోదాం సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు.

రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని ,అంతేకాక నిర్దేశించిన సమయంలో రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందని, ట్రాన్స్పోర్ట్ ,హమాలి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, ఈసారి పెద్ద ఎత్తున పంట వచ్చిందని, రైతులకు కష్టం కలగకుండా రైతుల చెంతకే వచ్చి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొంటున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ఈ రబీలో నల్గొండ జిల్లాలో అత్యధిక ధాన్యం పండిందని ,గతం తో పోలిస్తే 30,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా పండినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడిన హమాలి, ట్రాన్స్పోర్ట్ సమస్యను పరిష్కరించడం జరిగిందని, బుధవారం ఒక్కరోజే నల్గొండ జిల్లాలో 19000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, రానున్న పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని తెలిపారు. ఏ ఎంఆర్పి కాలువల లైనింగ్ కోసం 450 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరుగుతున్నదని, ఎస్ఎల్ బిసి సొరంగం పూర్తయితే జిల్లాలో మరింత ధాన్యం దిగుబడులు పెరుగుతాయి అన్నారు. లారీలు అవసరం ఉంటే మరిన్ని వినియోగించాలని, ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో లారీలు అవసరం ఉన్న కొనుగోలు కేంద్రాలకు ముందుగా పంపించాలని చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్ పి శరత్చంద్ర పవర్ ,రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డిసిఓ పత్యా నాయక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రామ్ పతి నాయక్, డిఎస్ఓ వెంకటేశం, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు మంత్రుల వెంట ఉన్నారు.

# నత్తనడకన రోడ్డు పనులు

మొదటి పేజీ తరువాయి..

అధికారులతో మాట్లాడారు.అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణం చేపట్టి కొన్ని నెలలు కావస్తున్న ఇప్పటివరకు పట్టించుకునే నాథుడు లేడని ఆయన మండిపడ్డారు,రోడ్డు నిర్మాణం పనులు ఆలస్యం కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవిశంకర్, సుధీర్ కుమార్, చిన్న యాదవ్, తదితరులు ఉన్నారు.

# సింగరేణికి పూర్వ వైభవం

మొదటి పేజీ తరువాయి..

అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులతో కాకా కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. సింగరేణి సంస్థకు రూ.400 కోట్ల నిధులు ఇప్పించి లక్ష ఉద్యోగాలను కాపాడిన వ్యక్తి కాకా వెంకటస్వామి అని గుర్తు చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కోల్ బ్లాక్ టెండర్లలో సింగరేణి సంస్థ పాల్గొనేలా చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొత్త గనులు ప్రారంభమైతే కొత్త ఉద్యోగావకాశాలు ఏర్పడతాయని, ఆర్కేపీ ఓపెన్‌కాస్ట్ ఫేజ్-2 ద్వారా సుమారు ఐదు వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతులు వచ్చిన వెంటనే గనిని ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రేక్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేల పెన్షన్ వచ్చేలా ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో కృషి చేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల పెంపు అంశాన్ని ముఖ్యమంత్రి అధ్యక్షతన త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా శ్రమశక్తి అవార్డు గ్రహీతలు పవన్ కుమార్, పుల్లూరి లక్ష్మణ్‌లను మంత్రి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కార్మికులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

# పారదర్శకతతో ప్రజాస్వామ్యం బలోపేతం

మొదటి పేజీ తరువాయి..

ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాలపట్టికలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగానిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని, అక్టోబర్ 27, 2025 నాటికి ఉన్న ఓటర్లందరికీ పాక్షికంగా పూరించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ ఫారమ్‌ల సేకరణ కోసం బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం 3 సార్లు సందర్శించేలా చూడాలని,ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు.

ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1 వేయి 200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. హై-రైజ్ బిల్డింగ్‌లు, మురికివాడలలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా,ఒక కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారికి ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరడం జరిగిందని, ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన తర్వాత అట్టి జాబితాను వెబ్‌సైట్‌లో, స్థానిక కార్యాలయాలలో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపుల కోసం ఫారమ్ 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను సమకూర్చడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షిత People's voice www.aakshitha.com AKSHITHA NATIONAL DAILY

శుక్రవారం । 15 । మార్చి । 2026



# కల్వర్టు పనులు ప్రారంభం

### మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మున్సిపాలిటీలో మహబూబ్నగర్ చౌరస్తా నుండి శివాజీ చౌకు వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్టిసి డిపో ఎదుట కల్వర్టు పనులను మున్సిపల్ చైర్మన్ పాల్గొని ప్రయాణికుల సౌకర్యార్థం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ కౌన్సిలర్స్ కొల్లోజు రాజేష్ ఎజాస్ రామ కాంత్ రెడ్డి మక్బుల్ నాయకులు వర్కాల భాస్కర్ రెడ్డి బృంగి ప్రవీణ్ బంగారి కేశవులు సంతు యాదవ్ పురుషోత్తం ముక్తాధర్ పడకంటి వెంకటేష్ దున్న సురేష్ నరేందర్ మహేష్ పవన్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు

# ముగ్గురు ఐకేపీ ఉద్యోగులపై వేటు

**గద్వాల, అక్షిత న్యూస్:** ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఐకేపీ సిబ్బందిపై గద్వాల్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం చర్యలు తీసుకున్నారు. తెలుగోనుపల్లి కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్.. విధుల్లో లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీవోఏ అలివేలు, సీసీ రంగన్నను సస్పెండ్ చేశారు. ఏపీఎం దేవానందానికి మెమో జారీ చేశారు. రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులను హెచ్చరించారు.



# ధాన్యం రైతుల కొనుగోలు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

### తరుగు పేరిట రైతులను దోపిడీ చేస్తున్న ప్రభుత్వం

### భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

**వలిగొండ/అక్షిత న్యూస్:** రైతుల వద్ద కొనుగోలు సమస్యను తీర్చే బాధ్యత ప్రభుత్వానిదే అని భువనగిరి మాజీ శాసనసభ్యులు పైల్ల శేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని లింగరాజు పల్లి ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని వలిగొండ మార్కెట్ యార్డ్ లోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న బాధలు అంతా ఇంతా కాదన్నారు. అదేవిధంగా తూకంలో రెండు కిలోలు ఎక్కువగా కాంటాను వేస్తున్నారని తరుగు పేరిట రైతును నష్టపరుస్తున్నారని ఆయన అన్నారు. అలాగే మిల్లర్లు సైతం రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని



తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మత్స్యగిరిగుట్ట మాజీ చైర్మన్ మద్దసాని కిరణ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి, వడిగొండ పట్టణ అధ్యక్షులు మహ్మద్ అఫ్రోజ్ సర్పంచులు బొడిగె లింగస్వామి, ఆవుల నరసింహ, టిఆర్ఎస్ నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, వంగాల వెంకన్న గౌడ్, బలుగూరు నరేష్ రెడ్డి, పైళ్ల మల్లారెడ్డి, ఎడవల్లి శాంతి కుమార్ ,పోలెపాక సత్యనారాయణ, తదితరులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:**

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో పర్యాటక మరియు మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ నగరం లోని పిల్లల మర్రిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడినట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయగా, అందులో





భాగంగా ఈరోజు రూ.2 .5 కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు. మయూరి పార్క్ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్, వ్యూ పాయింట్లు, టూరిస్టుల కోసం తాత్కాలిక కాటేజీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఫారెస్ట్ ఏరియా పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు జరుగుతాయని ఆయన తెలిపారు.

అలాగే కురుమూర్తి, మన్నెంకొండ, పిల్లమర్రి వంటి ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. వచ్చే సంవత్సరం నిర్వహించనున్న కృష్ణ పుష్కరాల దృష్ట్యా జిల్లాలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి సమర్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కూడా వాటిని ఆమోదిస్తూ జిల్లాలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. మహబూబ్ నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో పనిచేస్తోందని, గతంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుతూ వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, 1 వ డివిజన్ కార్పొరేటర్ దేప్లీ మేఘ్యానాయక్, కార్పొరేటర్లు ప్రశాంత్, రమేష్ రెడ్డి, తిరుమల వెంకటేష్, నాయకులు వర్ధ రవి, అశ్వాక్, హకీం, కాటం రాజు, డివైఎస్ఓ జె రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ విద్య బలోపేతమే ప్రభుత్వలక్ష్యం

**గద్వాల, అక్షిత న్యూస్:**

డిఐఇఓ హృదయ రాజు: మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా నేడు ప్రిన్సిపల్ శ్రీలత రెడ్డి




అధ్యక్షత జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ మరియు హెల్త్ అవేర్నెస్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్య బలోపే తానికి తీసుకున్న కార్యక్రమాలను సమాజానికి తెలవడం కోసం మరియు సమా జ భాగస్వామ్యం కోసం ఈ విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డిజిటల్ బోర్డులు మరియు ఫర్నిచ ర్, మైనర్ రిపేర్లకు గ్రాంట్లు మంజూరు చేయడం జరిగిందని ,అదేవిధంగా కళా శాల ప్రాంగణం శుభ్రంగా ఉంచడం కోసం స్వీపర్ & స్కావెంజర్ గౌరవ వేతనాలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు

.అదే సందర్భంగా విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం మంచి అధ్యాపకులను నియమించడం జరిగిందని అదేవిధంగా భవిష్యత్తులో ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పరీక్షల సన్నద్ధం కావడం కోసం ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు మరియు మానసిక అభివృద్ధికి స్టూడెంట్ కౌన్సిలర్ల నిర్వహించి హెల్ప్ ప్రోగ్రాములు నడుపుతున్నడంవల్ల విద్యార్థుల ఉత్తీర్ణ త శాతం కూడా పెరిగిందని తెలియజే శారు. కావున ప్రభుత్వ కళాశాలలో ఉన్న మంచి వసతులు అధ్యాపకులను వినియోగించుకోవడం కోసం కళాశాలలో అడ్మిషన్లు పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిప ల్ శ్రీలత రెడ్డి మేడం మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడం కోసం ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని కావున విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు కళాశాల ప్రత్యేకతలు గ్రామాలలో ప్రచారం చేసి అడ్మిషన్లు పెంచడం ద్వారా ఇంకా ఈ కళాశాల అభివృద్ధికి దోహద పడాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ మాట్లాడుతూ ఈ కళాశాల మా గ్రామంలో ఉంది కాబట్టే ఇక్కడ అమ్మాయిలు డ్రాప్ కాకుండా విద్య కొనసాగిస్తున్నారని తెలుపుతూ ఈ కళాశాల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ నవీన్ గారు విద్యార్థులకు ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు మరియు వయోజన దశలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మంచి పౌష్టికాహారంతో ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేతువానిపల్లి సర్పంచ్ పద్మా వెంకటేష్ నాయక్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సువర్ణ మరియు అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్ భాగ్యలక్ష్మి రాఘవేంద్ర ,రంగస్వామి, ఇఫ్తికర్ ,నీలవేణి మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

# తేమ శాతం పరిశీలించి ధాన్యం తీసుకురావాలి

**రాచాలపల్లి గ్రామంలో రైతులతో కలెక్టర్, ఎమ్మెల్యే ముఖాముఖి**

**రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం రాచాలపల్లి గ్రామ పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి గ్రామంలో వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు వద్దకు వెళ్లి పంట దిగుబడి, ధాన్యం నాణ్యత, కొనుగోలు కేంద్రాలకు తరలింపు ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లే ముందు తప్పనిసరిగా తేమ శాతం సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత తేమ శాతం ఉన్న ధాన్యాన్నే వెంటనే కొనుగోలు చేస్తారని తెలిపారు. అలాగే ధాన్యంలో, రాళ్లు, మట్టి లేకుండా శుభ్రంగా ఉంచితే కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని వివరించారు.

ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు జరుగుతుందని, ధాన్యం సేకరణ పూర్తైన తర్వాత 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని కలెక్టర్ తెలిపారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ....... రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

అనంతరం గుడి గాని పల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదకరంగా మారిన భవనాన్ని తొలగించి, నూతన పాఠశాల భవన అనుమతులు ఇవ్వాలని కోరగా, అందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, పీడీ హౌసింగ్ సంగప్ప, డీపీవో శ్రీరాములు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఉరుకొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:**
మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ నగరం లోని పిల్లల మర్రిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ




ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడినట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయగా, అందులో భాగంగా ఈరోజు రూ.2 .5 కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు. మయూరి పార్క్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్, వ్యూ పాయింట్లు, టూరిస్టుల కోసం తాత్కాలిక కాటేజీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఫారెస్ట్ ఏరియా పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు జరుగుతాయని ఆయన తెలిపారు.

అలాగే కురుమూర్తి, మన్నెంకొండ, పిల్లమర్రి వంటి ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. వచ్చే సంవత్సరం నిర్వహించనున్న కృష్ణ పుష్కరాల దృష్ట్యా జిల్లాలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి సమర్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కూడా వాటిని ఆమోదిస్తూ జిల్లాలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. మహబూబ్ నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో పనిచేస్తోందని, గతంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుతూ వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో



సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా, మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, 1 వ డివిజన్ కార్పొరేటర్ దేప్లీ మేఘ్యానాయక్, కార్పొరేటర్లు ప్రశాంత్, రమేష్ రెడ్డి, తిరుమల వెంకటేష్, నాయకులు వర్ద రవి, అశ్వాక్, హకీం, కాటం రాజు, జిల్లా పర్యాటక అధికారి జె రాజశేఖర్ రెడ్డి,టి.ఎస్.టి.డి. సి డి.ఈ పర్షవేది, తదితరులు పాల్గొన్నారు.



# సేవకు మించిన సంపద లేదు

**వైద్యం సంపాదనకు సాధనం కారాదు**

**ప్రజావైద్యులు పారుపల్లి గోర్కీ**

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా నిస్వార్ధంగా చేస్తున్న సేవకు మించిన సంపదలేదని వైద్యో నారాయణో హరి అన్న నానుడి ప్రకారం రేపటి వైద్యులు వైద్యాన్ని సంపాదనకు సాధనంగా కాకుండా సేవాభావంతో నిర్వర్తించి ఖ్యాతి గడించాలని ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ పారుపల్లి గోర్కీ కోరారు.

గాంధీ వైద్యకళాశాలలో నాలుగవ సంవత్సరం వైద్య విద్య అభ్యశిస్తున్న కనపర్తి మనోజ్ కుమార్ కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అందించిన ఇరవైవేల రూపాయల చెక్కు జ్ఞాపిక ను డాక్టర్ గోర్కీ ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్యతో కలసి గురువారం స్థానిక గోర్కి పబ్లిక్ స్కూల్ కార్యాలయం లో అందజేసి మాట్లాడారు.

గురువారం నాడు పరిశ సీతారత్నం ఆరవ వర్ధంతి సందర్భముగా నిరుపేద విద్యార్ధి కనపర్తి మనోజ్ కుమార్ ఉన్నత విద్యకు పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించిందని ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య తెలిపారు.పౌరులు అందరు సేవాభావం కలిగిఉండాలని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ విద్యారంగానికి చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ గోర్కీ ఈసందర్భముగా కోరారు.


ఈకార్యక్రమంలో ఎస్జీపిఏటి ఖమ్మం జిల్లా సంయుక్త అధ్యక్షులు కనపర్తివెంకటేశ్వర్లు ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలి

**బోగారం తల్లిదండ్రుల సమావేశంలో సర్పంచ్ సాయికుమార్ గౌడ్**

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు రామన్నపేట మండలంలోని బోగారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు, పాఠశాల అభివృద్ధి, సమ్మర్ క్యాంపు



నిర్వహణ తదితర అంశాలపై తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ హాజరై మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైకాని ఉమామహేష్ యాదవ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పబ్బు జ్యోతి, వార్డు సభ్యులు కనుక మల్లేష్, నేరటి మానస సురేష్ యాదవ్, కడారి పావని పాపయ్య, గోగు సురేష్ యాదవ్, వనం అండాలు యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు ముస్కా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత, శేఖర్, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.




# బండమీదిపల్లిలో నూతన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి

**జడ్చర్ల, అక్షిత న్యూస్:** జడ్చర్ల మండలంలోని బండమీదిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.






ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే గ్రామీణ విద్యాభివృద్ధికి పునాది అని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా ఆధునిక సదుపాయాలతో భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు.

# సోషల్ మీడియాలో అసభ్యకర, కించపరిచే పోస్టులు పెడితే కఠిన చర్యలు

**- జిల్లా ఎస్పీ నితిక పంత్ హెచ్చరిక**

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ తదితర మాధ్యమాలలో వ్యక్తిగతంగా గాని, కుట్రపూరితంగా గాని ఉద్దేశపూర్వకంగా వ్యక్తులను, వర్గాలను లేదా సమాజాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం,



అవమానకరమైన పోస్టులు, ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం, స్టేటస్‌లలో పెట్టడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారని, ఇటువంటి చర్యల వల్ల శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా తప్పుడు ప్రచారాలు, అసత్య వార్తలు, మార్ఫింగ్ చేసిన ఫోటోలు, అసభ్యకర వీడియోలు, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే కంటెంట్‌ను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తీవ్ర నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు.

సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాల ప్రకారం నిందితులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు చేయడానికి ముందు అది ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుందా లేదా చట్ట విరుద్ధమా అనే విషయాన్ని తప్పనిసరిగా ఆలోచించాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అసభ్యకర లేదా విద్వేషపూరిత పోస్టులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

సోషల్ మీడియాను సమాజ హితం కోసం బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆకస్మిక తనిఖీ

**గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

**గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు**

**ఉరుకొండ మండల గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన**

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం రాచాలపల్లి, రేవల్లి, గుడి గాని పల్లి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, తోకలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,ఉదయం ఏడు గంటలకే గ్రామాలకు చేరుకున్న అధికారులు గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, పనులు వేగంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ సామగ్రి సరఫరా, సాంకేతిక సహాయం విషయంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులను శాశ్వత పరిష్కారంగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా డ్రైనేజ్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యమైన నిర్మాణం చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మిషన్ భగీరథ తాగునీటి సరఫరా వ్యవస్థను కూడా పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పైప్‌లైన్ వ్యవస్థను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రజాధనం వృథా కాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు.

ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ..





రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా గ్రామాల్లోకే వెళ్లి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు ఇళ్లు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడం ద్వారా గ్రామాల రూపు రేఖలు మారుతున్నాయని, అధికారులు ప్రజలతో సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

గ్రామ పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, పీడీ హౌసింగ్ సంగప్ప, డీపీవో శ్రీరాములు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, ఉరుకొండ తహసీల్దార్ యూసుఫ్ అలీ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# పడకల్ గ్రామంలో బడిబాట కార్యక్రమం

**ప్రారంభించిన గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:**

తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా బడిబాట కార్యక్రమం ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి హాజరై బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వారు ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో కలిసి గ్రామంలో బడిబాట కార్యక్రమం నినాదాలు చేస్తూ పర్యటించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ. బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని విద్యతోనే ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని వారు కొనియాడారు



విద్య ద్వారా పేదరిక నిర్మూలనతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చని విద్యతో సమాజంలో కీర్తి ప్రతిష్టలు పొందవచ్చని వారు తెలిపారు. నేటి సమాజంలో డబ్బుతో కొనలేనిది విద్య ఒక్కటే అని వారు సూచించారు. కాబట్టి చిన్నారు లందరని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామంలోని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి గారు ఉపసర్పంచ్ జీనుకుంట్ల రాఘవేందర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాందాస్ సార్ మరియు శ్రీనివాస్ సార్ స్కూల్ చైర్మన్ స్వాతి వార్డ్ సభ్యులు జోగు విజయ్ జల్లెల సుహాసిని,లత్తుపల్లి వసంత, అబ్దుల్ వాజీద్,బండగల్ల చందు, బూరిగాళ్ల రాధిక, చౌటీ విమల,జెనిగే నర్సింహా, చౌటి విజయ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తుళ్ళ తిరుపతి, బషీర్, లష్మినారాయణ, సత్తాయ,మహేష్, యాదయ్య మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లట్టుపల్లి జగ్గారెడ్డి, మాజీ సర్పంచ్ చౌటి రమేష్ గ్రామ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు

## రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# నీట్ పేపర్ లీకేజీపై భారీ నిరసన

### పోలిసుల అడ్డగింపు... తీవ్ర ఉద్రిక్తత

**రామన్నపేట అక్షిత ప్రతినధి:** ఈరోజు రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్నీ నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టె సంతోష్ కుమార్ గారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్‌కి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీతో 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడింది. మోడీ పాలనలో వరుస పేపర్ లీకులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మోడీ ప్రభుత్వంలో గత పదేళ్లలో 89 పేపర్ లీకులు కాగా, 48 సార్లు మళ్లీ పరీక్షలు నిర్వహించడం సిగ్గుచేటు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న ఈ మోడీ ప్రభుత్వం దేశ ప్రజానికానీకి సమాధానం చెప్పాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, కోట సుధాకర్, కేశవదాసు వెంకటేష్, బొడ్డు సురేందర్ రావు, ఏటెల్లి



పరమేష్, చల్లా సత్యప్రకాష్, బండ లింగస్వామి, ఇనాయతుల్లా బైగ్, గుండాల సతీష్, పెరమల్ల నవీన్, తెల్ల శేఖర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు బైరబోయిన శోభా, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కల్లూరి శివ, కందగట్ల రాహుల్, యువజన కాంగ్రెస్ నాయకులు పల్లపు రవి, జవ్వాజి శ్రీకాంత్, కన్నెబోయిన రవీందర్, సింగరాజు యశ్వంత్, అంజద్, అజార్, కందుల మణి, నల్లబాల శరత్, సుర్వి మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు

# ప్రజా ప్రతినిధుల అభినందన

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్లపాడు విద్యార్థులు2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ చూపగా మర్లపాడు గ్రామ సర్పంచి ఆంద్రయ్య వారిని సత్కరించారు. వివరాలలోకి వెళితే గత విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు మార్చి నెలలో జరిగిన వార్షిక పరీక్షలలో విశేష ప్రతిభను చూపారు.వీరిలో బి.మన్విత 600 మార్కులకు గాను 553 మార్కులు సాధించి వేంసూరు మండలంలో ద్వితీయ స్థాయిలో నిలవగా,మండల తృతీయ స్థానాన్ని 551 మార్కులతో





పి.రుష్మిత కైవసం చేసుకుంది. తరువాత బి.యశస్విని 524 మార్కులు,కర్రి కీర్తన 514,కర్రి మౌనిక 512 మార్కులు పాఠశాల స్థాయిలో సాధించిన వారిలో ఉన్నారు.వీరికి భీమిరెడ్డి నారాయణ రెడ్డి, సుశీలమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు నగదు బహుమతులు అందచేశారు.అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సమావేశంలో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా పరంగా అందచేస్తున్న ఉచిత సదుపాయాలను వినియోగించుకుని విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్,తిరుపతిరావు,ఫకీర్, అనంద కుమార్, కరుణలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రామన్నపేటలో 64 మందికి కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాల చెక్కులను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు పంపిణీ చేశారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తోంది. ఒక్కో లబ్ధిదారునికి రూ.1,00,116/- ఆర్థిక సాయం అర్హులైన ప్రతి కుటుంబానికి అందిస్తుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల గడప గడపకు చేరేలా కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

"ఆడపిల్ల పుట్టిందని తల్లిదండ్రులు బాధపడే పరిస్థితి ఉండ కూడదు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి భారం కాకూడదనే ఈ పథకం తీసుకొచ్చాం. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల




ఖాతాల్లోకే డబ్బు జమ చేస్తున్నాం" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, జూఖిఎం చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, ఎంపీడీఓ, తహ సీల్దార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 26వ వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తాం..

### వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి....

### వేసవిలో నీటి ఎద్దడి కలగకుండా సొంత ఖర్చులతో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ నేహా నాజ్, బషీర్ భాయ్....

### వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసిన నేహా నాజ్‌ను అభినందించిన మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ వైస్ చైర్మన్ ఎంఎ జబ్బార్

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** కోదాడ మున్సిపల్ 26వ వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నేహా నాజ్ బషీర్ భాయ్ అన్నారు. గురువారం వార్డులో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు సొంత




ఖర్చులతో వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ వైస్ చైర్మన్ ఎంఎ జబ్బార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్ లతో కలిసి ప్రారంభించారు. వార్డు ప్రజలకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తా అన్నారు. వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం అన్నారు. వార్డు లో ప్రతి ఇంటికి ఉచితంగా మంచి నీరు సరఫరా చేస్తామన్నారు. మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ వైస్ చైర్మన్ జబ్బర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్ లు మాట్లాడుతూ కౌన్సిలర్ నేహా నాజ్ వార్డు ప్రజల కోసం సొంత ఖర్చులతో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వార్డు అభివృద్ధికి కి కృషి చేసి పేరు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో, డీసీఎం కాజా, ఫ్రూట్ అసోసియేషన్ అధ్యక్షులు బాబ ,చాంద్ పాషా ,ముస్తఫా, వార్డు కౌన్సిలర్ ఎస్.కె నేహా నాజ్, గన్నేమియా, ముక్తి,హతహర్, శ్రీరంగం ప్రమీల, కాసర్ల రాజు, మైనార్టీ నాయకులు బాగ్దాద్, భాయిజాన్, ఘోర ,నసీర్, టిల్లు ,నిస్సార్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

### అక్రమ రవాణా జరిగితే 8712670505, 8712670557కు సమాచారం ఇవ్వాలి: జిల్లా ఎస్పీ నితిక పంత్

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తిగత దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ నితిక పంత్ అన్నారు.పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు, చట్టపరమైన అంశాలపై గో రక్షణ కమిటీతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహంచారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... గో రక్షకుల పేరుతో






చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. పశువుల అక్రమ రవాణాను గమనిస్తే, వెంటనే 8712670505, 8712670557 కు, స్థానిక పోలీసులకు, డయల్ 100 కు సమాచారం అందించి సహకరించాలన్నారు.

ఇప్పటికే జిల్లా సరిహద్దులో 14 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆవులు, దూడల అక్రమ రవాణా, అమ్మకం లేదా వధకు వ్యతిరేకంగా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా జంతువుల కదలికలను పర్యవేక్షించడానికి అధికారులు మూడు షిఫ్టులలో చెక్‌పాయింట్‌లను ఏర్పాటు చేశామని , ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని అన్నారు.కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్ పాల్గొన్నారు.



# తమిళనాడు పాండిచ్చేరి పార్టీ నాయకులతో మద్దిశెట్టి భేటీ


**ఖమ్మం /అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఎన్సీపీ పార్టీ – ఎన్డీఏ మహాకూటమి జాతీయ కార్యవర్గ సభ్యులు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జ్ అయిన మద్దిశెట్టి సామేలుని కలిసేందుకు తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరి మధురై ప్రాంతాల నుంచి వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు విచ్చేశారు.వచ్చిన నాయకులకు మద్దిశెట్టి సామేలు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మధురైలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న పార్టీ కోర్ కమిటీ సమావేశానికి హాజరుకావాల్సిందిగా మద్దిశెట్టిని ఆహ్వానించారు.ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో పి. శంకర్ ( ఎన్సీపీ పార్టీ సెక్రటరీ మద్రాస్ హైకోర్టు న్యాయవాది)జై కృపాకర్ (ఎన్సీపీ పార్టీ జాయింట్ సెక్రటరీ)(వి. రవికుమార్ -- పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు)ఎం. వీరమలై (ఆర్జేడీ పార్టీ అసిస్టెంట్ సెక్రటరీ)జి. రాజు( ఎన్సీపీ పార్టీ తమిళనాడు జనరల్ సెక్రటరీ)వి. రాజు (ఆర్ జేడీ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు)ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# విద్య అనేది ఎవరు దోచుకోలేని సంపద

### రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి

**వనపర్తి అక్షిత ప్రతినిధి:**

సంపాదన ఎంత సంపాదించిన, ఏదో రూపంలో దొంగిలించబడు తుంది, కానీ విద్యా అనేది ఎవరు దోచుకోలేని సంపదగా అంతిమంగా మిగిలిపోతుందని వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయంలో కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై నూతన మొదటి అంతస్తును ప్రారంభించారు.



కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి , తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి , జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ ....వనపర్తి అంటేనే “విద్యపర్తి”గా ప్రసిద్ధి చెందిందన్నారు. ఉమ్మడి జిల్లాలోని అనేక మంది విద్యార్థులు వనపర్తికి వచ్చి చదువుకునేవారని గుర్తుచేశారు.

ఇంత మంచి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. డబ్బును దోచుకోవచ్చు కానీ చదువును ఎవరూ దోచుకోలేరని అన్నారు. గ్రంథాలయానికి మంచి పుస్తకాలను తాను డొనేట్ చేస్తానని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, వనపర్తి మున్సిపల్ చైర్పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే బండి భగీరద్‌ను అరెస్టు చేసి శిక్షించాలి

### సిపిఐ(ఎం)ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్

### బండి భగీరద్ దిష్టిబొమ్మ దగ్ధం

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఇటీవల ఒక మైనర్ బాలికకు మద్యం తాగించి హత్యాచారానికి పాల్పడ్డ బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్టీ రోడ్ వద్ద బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరద్ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇలాంటి నీచానికి పాల్పడటం సిగ్గుచేటు అని ఈ ఘటనను యావత్తు దేశ ప్రజలందరూ ఖండిస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదని నున్నా నాగేశ్వరరావు విమర్శించారు.బండి సంజయ్ భావోద్వేగ ప్రసంగాల ద్వారా కొడుకు క్రూరుడుగా మారడని బండి సంజయ్ ప్రసంగాల్లో కూల్చటం చీల్చడం,తొక్కడం చంపడం శివాలు శవాలు అని రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం వల్ల కుమారుడు కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ నేను ఏ నేరం చేసిన నన్ను ఎవరు ఏమి చేయలేదు అహంకారంతో తన తండ్రి తన వెనుక ఉన్నాడని భరోసాతో నన్ను కాపాడుతాడు అని నమ్మకంతో ఇలాంటి నిజమైన పనులకు ఒడిగడుతున్నాడని అని ఆరోపించారు. గతంలో కూడా తన తోటి విద్యార్థుల పై అరాచకంగా దాడి చేసిన ఘటనలు కూడా మన ముందున్నాయని అప్పుడే అతనిపై చర్య తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ నేరానికి పాల్పడి ఉండేవాడు కాదని ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం అతనిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని



శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలని లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వం అతన్ని పదవి నుంచి తొలగించాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మహిళల పట్ల బిజెపి పార్టీ ఎంత చులకన భావంతో ఉన్నదో ఎంత లెక్కలేని తనంతో ఉన్నదో అనేక ఘటనలు రుజువు చేస్తున్నాయని బిజెపి నాయకులు ఒక్కొక్కలుగా మహిళలపై విరుచుకుపడుతున్నారని మహిళలకు చదివు ఎందుకని మాట్లాడుతున్నారని మహిళలు రాజకీయాల్లోకి రాకూడదని కుట్రబుద్ధితో మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా అమలు చేయడం లేదని ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు విమర్శించారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ నాయకులు దొంగల తిరుపతిరావు భుక్యా శ్రీనువాసురావు పి నాగసులోచన ఉపేంద్ర మాజీ కార్పొరేటర్లు యర్రా గోపి ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లు ధరల నియంత్రణే లక్ష్యంగా కదలాలి

### -నేలకొండపల్లిలో భారత మహిళా సమాఖ్య 9వ మండల మహాసభలో తాటి నిర్మల కర్నాటి నళిని రాణి

### -మండల కార్యదర్శిగా కర్నాటి నళిని రాణి అధ్యక్షురాలుగా బుర్ర విజయమ్మ ఎన్నిక

**ఖమ్మం /అక్షిత బ్యూరో:** మహిళల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలని భారత మహిళా సమాఖ్య పిలుపునిచ్చింది. గురువారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం లో మారిశెట్టి విజయదుర్గ అధ్యక్షతన మహిళా సమాఖ్య 9వ మండల మహాసభ విప్లవాత్మక వాతావరణంలో నిర్వహించారు.మహాసభను ఉద్దేశించి మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ధ్వజమెత్తారు. ధరల పెరుగుదలతో సామాన్య మహిళలకు ఇల్లు గడవడం గగనమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కేవలం ప్రసంగాలకే పరిమితమైందని క్షేత్రస్థాయిలో మహిళల జీవితాల్లో మార్పు రావడం లేదని విమర్శించారు.మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కర్నాటి నళిని రాణి మాట్లాడుతూ అమరజీవి కర్నాటి కృష్ణయ్య చూపిన పోరాట స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల



అమలులో పాలకులు చేస్తున్న జాప్యాన్ని ఆమె ఎండగట్టారు. సమాజంలో మహిళలపై దాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.మహాసభ అనంతరం నేలకొండపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మండల కార్యదర్శి గా కర్నాటి నళిని రాణి అధ్యక్షురాలు గా బుర్ర విజయమ్మ సహాయ కార్యదర్శి కుంచం రాంబాయి ఉపాధ్యక్షులు మారిశెట్టి విజయదుర్గ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ తమ్మిశెట్టి మమత వీరితో పాటు మరో 15 మందితో కార్యవర్గ కమిటీని ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ మండలంలోని వివిధ గ్రామాల నుండి మహిళా ప్రతినిధులు సిపిఐ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికారులు అంకితభావంతో పనిచేయాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, అక్షిత బ్యూరో:** స్టేషన్ అధికారులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని వరంగల్ సిపి సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ ఆదేశాల



మేరకు హసన్ పర్తి, కాజీపేట పోలీస్ స్టేషన్ల నూతన ఇన్స్ స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్లు మహేందర్, శ్యాం సుందర్ గురు వారం వరంగల్ పోలీస్ కమి షనర్‌ను సిపి క్యాంపు



కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నిజాయితీతో విధులు నిర్వహిస్తూ, బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, పోలీస్ స్టేషన్లో న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితులకు కలిగించా లని పోలీస్ కమిషనర్ నూతన ఇన్స్ స్పెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
శుక్రవారం । 15 । మార్చి । 2026





# మిషన్ భగిరథ ద్వారా గ్రామాలకు శుద్ధజలం అందించాలి

**- కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** జిల్లాలో వేసవి కాలం దృష్ట్యా ప్రతి గ్రామానికి మిషన్ భగిరత పథకం ద్వారా శ్రద్ద జలం ను అందించాలని కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం కెరమెరి మండలంలోని ధనోరా గ్రామములోని మిషన్ భగిరత పంపు హౌస్ లను సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. పంపు హౌస్ నుండి ఎన్ని మండలాలకు త్రాగు నీరును పంపింగ్ చేస్తారని గ్రామాలకు నీరు అందుతుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా త్రాగు నీరుకు ఇబ్బందులు లేకుండా ప్రతి గ్రామానికి పంపింగ్ చేయాలన్నారు మోటార్లు పైపు లైన్‌లు ఏమైనా లికేజిలను మర్మతులు చేసుకోవాలన్నారు. తాగు నీరును నిరంతరం సరపరా అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం కెరమెరి మండలలోని కొరారి కోలం గూడ గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి యన్ ప్రకాష్ రావు తో కలిసి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి 110 ఇండ్లను మంజూరు చేయగా 108 ఇండ్ల పనులను ప్రారంబించడం జరిగిందని 7 ఇండ్లు పూర్తయ్యాయని అన్నారు. మిగితా ఇండ్లు వివిధ దశలో వున్నాయని ఇందులో 86 ఇండ్లు స్లాబ్ వేసేందుకు సిద్దంగా వున్నాయని అన్నారు. లబ్దిదారులు తమ ఇండ్లను పూర్తి నాణ్యతతో నిర్మించుకోవలన్నారు గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతి రోజు లబ్దిదారులతో మాట్లాడి ఇళ్ళ నాణ్యతను పరిశీలించి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమములో గృహ నిర్మాణ శాఖ అధికారులు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాయగూడెం బడిబాటలో పాల్గొన్న సర్పంచ్ బోయిన వేణు

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** నేలకొండపల్లి మండలం రాయగూడెం గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాల బడిబాటలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. ఈ బడి బాటలో భాగంగా పేరెంట్స్ మీటింగ్ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బోయిన వేణు పాల్గొన్నారు. అనంతరం బడిబాటలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేశారు. ప్రైవేట్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులని కలిసి వారి పిల్లల్ని మన గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో చేర్పించవలసిందిగా కోరారు. నాణ్యమైన విద్యను క్రమశిక్షణను ప్రభుత్వ పాఠశాలలో అందిస్తారని జూన్ 12 ప్రభుత్వ పాఠశాల ఓపెన్ అయిన తర్వాత మన ముఖ్యమంత్రి ప్రతి విద్యార్థికి అందించే కిట్స్ గురించి అలాగే ప్రభుత్వ పాఠశాలలో గల సౌకర్యాల గురించి ఆయా తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రేమ్ కుమార్ ఏఐపిసి చైర్మన్ రాణి కుమారి ప్రధానోపాధ్యాయులు జినాగేశ్వరరావు ఉపాధ్యాయులు సత్యనారాయణ నాగేశ్వరరావు ఉష శ్రీ శారద ప్రమీల పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తున్నాం

**విద్యా వారోత్సవాల్లో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం,**

**పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి**

**డీఈఓ రమేష్ కుమార్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా గురువారం బిజినపల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ....

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించే సాధనమని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని డిఇఓ వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాస్‌రూములు, ఆంగ్ల మాధ్యమ బోధన, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వంటి పథకాల ద్వారా విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు.

ఈ అవకాశాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని పిల్లలను ప్రతిరోజూ ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు.

విద్యార్థుల హాజరు శాతం పెరగడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, పిల్లల చదువుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డీఈఓ రమేష్ కుమార్ అన్నారు. పిల్లలలో మొబైల్ ఫోన్ సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి, చదువుపై దృష్టి కేంద్రీకరించేలా తల్లిదండ్రులు మార్గనిర్దేశనం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలని సూచించారు.

ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల విద్యా పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై తల్లిదండ్రులతో చర్చించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, హరిత వాతావరణం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఈఓ సూచించారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

అనంతరం మండల కేంద్రంలో ప్రధాన వీధుల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతులను విద్యా ప్రమాణాలను అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి గ్రామంలో "బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలో నిర్వహించిన బడిబాట ర్యాలీ, ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ




ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు సమతుల పౌష్టికాహారం, అవసరమైన మౌలిక వసతులు, అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఉత్తమ బోధన అందుతున్నందున ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జిసంధ్యారాణి ఆర్జేడి సత్యనారాయణ రెడ్డి, డివో రంగయ్య నాయుడు , దుగ్గొండి తాసిల్దార్ సమ్మక్క, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పిల్లలు పాల్గొన్నారు.

# అయ్యవారికుంట అలుగు ధ్వంసం

**- ప్రభుత్వ ఆస్తిపై దాడి.. ఆక్రమణ యత్నంపై ఫిర్యాదు**

**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:**

అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని అయ్యవారికుంటలో ప్రభుత్వ భూమిని అక్రమంగా సాగు చేసుకునేందుకు కొంతమంది ఆక్రమణ దారులు చెరువుకు అనుబంధంగా ఉన్న అలుగును రాత్రికి రాత్రే ధ్వంసం చేసిన ఘటన కలకలం రేపింది. కుంటలోని నీటిని బయటకు వెళ్లగొట్టే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు అధికారుల ప్రాథమిక పరిశీలనలో వెల్లడైంది. ఈ ఘటనతో ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లడంతో






పాటు నీటి వనరుల పరిరక్షణపై ఆందోళన వ్యక్తమవుతోంది. విషయం తెలుసుకున్న ఎన్ఎస్పి అసిస్టెంట్ ఇంజనీర్ రోజా సంఘటనా స్థలాన్ని పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆమె వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీను పాల్గొన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.